## క్లుప్తంగా

### అక్షయ తృతీయకు పానకం వితరణ



పంచముఖ శక్తిగణపతి దేవస్థానం వద్ద అక్షయ తృతీయ సందర్భంగా పానకం, మజ్జిగ పంచిపెడుతున్న నిర్వాహకులు

**ఆత్మకూరురూరల్(మర్రిపాడు):** అక్షయ తృతీయను పురస్కరించుకుని మండలంలోని డీసీపల్లిలోని శ్రీపంచముఖ శక్తిగణపతి దేవస్థానం వద్ద ఆదివారం పానకం, మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేసి భక్తులకు పంచిపట్టారు. ఆలయ పూజారి పాశర్లపూడి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అక్షయ తృతీయకు పురాణ కాలం నుంచి ఎంతో ప్రాశస్త్యం ఉందని, కేవలం బంగారం కొనుగోలుకు ఉద్దేశించినది మాత్రమే అక్షయ తృతీయ ప్రాధాన్యత కొందరిలో ఉండడం అపోహ మాత్రమేనన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు రేవూరు సుధమ్మ, రమణారెడ్డి, చిట్టెం శ్రీనివాసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### మాజీ సైనికులకు ఇళ్ల స్థలాలు

**ఆత్మకూరు:** మాని సైనిక కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం సైనిక కాలనీల్లో ప్రభుత్వ ధరకు ఇళ్ల స్థలాలు అందజేస్తుందని ఆసక్తి ఉన్నవారు నమోదు చేసుకోవాలని సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు కె.నాగేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సైనిక కాలనీల్లో 175 చదరపు గజాల ఇళ్ల స్థలాలు ప్రభుత్వం మాజీ సైనికులకు లేదా వితంతువులైన వారి భార్యలకు అందజేయనున్నట్లు తెలిపారు. నెల్లూరులోని సైనిక సంక్షేమ కార్యాలయంలో తమ వివరాలు ఏప్రిల్ 24వ తేదీలోపు నమోదు చేసుకోవాలని, ఆత్మకూరు సంక్షేమ సంఘం కార్యాలయంలోనైనా నమోదు చేసుకోవచ్చునని తెలిపారు. వివరాల కోసం 98905 00949 నంబరులో సంప్రదించాలన్నారు.

### గురుకులం ప్రవేశ పరీక్ష ప్రశాంతం

**చేజర్ల:** డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో 5వ తరగతి ప్రవేశానికి నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఆదివారం చేజర్ల మండలం ఆదూరుపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం విద్యాలయంలో జరిగింది. 5వ తరగతిలో ప్రవేశానికి మొత్తం 310 మంది హాజరు కావాల్సి ఉండగా 223 మంది హాజరయ్యారని చీఫ్ సూపరింటెండెంట్ బి.శైలజాకుమారి, అబ్జర్వర్ పి ఉమారాణి తెలిపారు. ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి మొత్తం 171 మంది హాజరు కావాల్సి ఉండగా 150 మంది హాజరయ్యారన్నారు.

### ముగిసిన సీతారాముల ఉత్సవాలు

**వరికుంటపాడు:** మండలంలోని తూర్పుకొండారెడ్డిపల్లిలో శుక్రవారం నుంచి ప్రారంభమైన సీతారాముల ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఉదయం వసంతోత్సవం నిర్వహించి స్వామి వార్లను పారువేటకు తరలించారు. గ్రామోత్సవం అనంతరం ఉత్సవ విగ్రహాలను ఆలయం వద్దకు చేర్చారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### విద్యుత్ సరఫరాలో అంతరాయం

**ఆత్మకూరురూరల్(మర్రిపాడు):** మర్రిపాడు మండలం కృష్ణాపురం సబ్‌స్టేషన్ పరిధిలోని ఏపిలిగుంట ఫీడర్‌లో శుక్రవారం రాత్రి నుంచి ఆదివారం మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. తాగునీటి పథకాలు పనిచేయకపోవడంతో పలు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మండల ఏఈకి ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందించలేదని బాధిత గ్రామాల ప్రజలు వాపోయారు. చివరికి ఆదివారం సాయంత్రానికి విద్యుత్ సరఫరా పునరుద్ధరించడంతో ప్రజలు ఉపశమనం పొందారు.

### ప్రశాంతంగా ప్రవేశ పరీక్ష



పరీక్ష రాసే విద్యార్థులకు పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

**సంగం:** సంగం బాలికల గురుకుల పాఠశాలలో ఐదో తరగతి ప్రవేశ పరీక్ష ఆదివారం ప్రారంభమైంది. విద్యార్థులను పోలీసులు, సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీ చేసి లోపలికి అనుమతించారు. ఉదయం జరిగిన 5వ తరగతి ప్రవేశ పరీక్షకు 270 మందికి 193 మంది, మధ్యాహ్నం జరిగిన ఇంటర్మీడియట్ ప్రవేశ పరీక్షకు 220 మందికి 192 మంది హాజరయ్యారని ప్రిన్సిపల్ మహాలక్ష్మి తెలిపారు. అన్ని మౌలిక వసతులు ఏర్పాటు చేశామని చెప్పారు. విద్యార్థుల తల్లిదండ్రులకు వేసవి నేపథ్యంలో పాఠశాల ఆవరణలో ప్రత్యేకంగా షామియానాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ శారు.

# ఆర్టీసీ నిర్వహణ అస్తవ్యస్తం



ఆత్మకూరు డిపోలోని బస్‌షెల్టర్‌లో బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు

**ఆత్మకూరురూరల్:** ఆత్మకూరు ఆర్టీసీ డిపోతో పాటు ఇదే ఆవరణలో ఉన్న బస్‌షెల్టర్ నిర్వహణ రోజురోజుకు అస్తవ్యస్తంగా తయారవుతోంది. డిపోలో నెలకొన్న పలు సమస్యల పరిష్కారంలో సంబంధిత యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడంతో ప్రయాణికుల పాట్లు చెప్పనలవి కాకుండా ఉన్నాయి. ఈ నెల 17న ప్రజారవాణా సంస్థ నెల్లూరు జోన్ ఈడీ ఆదాం సాహెబ్ ఉదయం 9 నుంచి రాత్రి 7 గంటల వరకు డిపో, గ్యారేజీలో అణువణువు పరిశీలించారు. ఏ ఒక్క విభాగం సరిగా పనిచేయడం లేదంటూ సంబంధిత విభాగాల అధికారులు, సిబ్బందికి చీవాట్లు పెట్టి హెచ్చరికలు జారి చేశారు. డిపో ప్రధాన గేటు ముందు భాగంలో ఉన్న మున్సిపల్ సైడ్ కాలువపై 40 ఏళ్ల క్రితం నిర్మించిన కల్వర్టు 9 నెలల క్రితం కూలిపోయి డిపోకు రాకపోకలు సాగించే వాహనదారులు, ప్రయాణికులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఆర్టీసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. ప్రయాణికులు, మీడియా ప్రతినిధులు వివిధ సందర్భాల్లో ఇదే విషయమై అధికారులను ప్రశ్నిస్తే.. ఎప్పటికప్పుడు మరో నెల రోజుల్లో సమస్య పరిష్కరిస్తామంటూ అధికారులు చెప్పడమేగానీ కార్యాచరణకు పూనుకున్న దాఖలాలు లేవు. డిపో బస్‌స్టేషన్‌కు రాకపోకలు సాగించే రెండు మార్గాలు ఉండగా కల్వర్టు దెబ్బతిన్న మార్గాన్ని ముళ్ల కంపతో మూసివేసి ఒకే ద్వారం నుంచి బస్సులు రాకపోకలు సాగించేలా ఏర్పాట్లు చేశారు. ఈడీ తనిఖీ సందర్భంగా ఈ విషయమై ఆయన వెంట కార్యక్రమంలో పాల్గొన్న ఆర్టీసీ ఈఈ వెంకటేశ్వర్లును విలేకరుల ప్రశ్నించగా సమాధానం చెప్పలేకపోగా చిందులేశారు. అత్యవసరం, ప్రమాదకరంగా కూడా ఉన్న కూలిన కల్వర్టు సమస్య పరిష్కరించకుండా డిపో గ్యారేజ్ ఆవరణలో చిన్నపాటి గుంతలు, అక్కడక్కడ రంగులు వేసి ప్రభుత్వ నిధులు వృథా చేయడమేమిటని ప్రజలు ప్రశ్నిస్తుండగా అదే విషయాన్ని ఈఈ దృష్టికి తెచ్చిన విలేకరులను ఈడీ సమక్షంలోనే తీవ్ర స్వరంతో బెదిరించారు. ఈ తంతు చూస్తున్న కార్మికులు నివ్వెరపోయారు. మండు వేసవిలో ఆర్టీసీ డిపోలోని బస్సు షెల్టర్‌లో బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికులకు అవసరమైన కనీస సౌకర్యాలు అందుబాటులో లేకపోవడం విమర్శలకు తావిస్తోంది. ప్రయాణికులు దాహం తీర్చుకునేందుకు ఒక చిన్న కుండ బస్సు షెల్టర్‌లో ఒక మూలన ఏర్పాటు చేసి అధికారులు చేతులు దులుపుకోవడం విశేషం. బస్సులు ఆలస్యమైన సమయంలో అక్కడ వేచి ఉండే ప్రయాణికులు అన్న పానియాలకు సైతం అలమటించాల్సిన పరిస్థితి ఉంది.

**వారం రోజుల్లో కల్వర్టు పనులు చేయిస్తాం**

వారం రోజుల్లో కల్వర్టు పనులు ప్రారంభించి సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాను. డిపో ఆవరణలోని బస్ షెల్టర్‌లో తాగునీటి సౌకర్యం కల్పించేందుకు ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డిని వాటర్ కూలర్ అందజేయాలని కోరామని, ఈలోగా ఎవరైనా దాతలు స్పందిస్తే తాగునీటి సౌకర్యం కల్పిస్తాం.
– కరీమున్నీసా, డిపో మేనేజరు, ఆత్మకూరు



ఆత్మకూరు ఆర్టీసీ డిపో బస్‌స్టేషన్‌లో నిలిచి ఉన్న బస్సులు



9 నెలలుగా బాగుపడని కల్వర్టుపై కంప అడ్డుగా వేసిన దృశ్యం

# భీకర ఉరుములు

- కావలిని వణికించిన మెరుపులు
- ఒకటిన్నర గంట పాటు భారీ వర్షం
- కాలువల్లా మారిపోయిన రోడ్లు
- విద్యుత్ సరఫరా ఆగిపోవడంతో పట్టణమంతా అంధకారం



వర్షపు నీటి వల్ల కాలువగా మారిపోయిన రోడ్డు

**కావలి:** కావలి పట్టణాన్ని భీకరమైన ఉరుములు వణికించాయి. ఆదివారం సాయంత్రం 6 గంటల నుంచి ప్రారంభమైన వర్షంతో పాటు విపరీతమైన ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో జనాలు ఎక్కడ పిడుగులు పడుతున్నాయో ఆందోళనకు గురయ్యారు. ఉరుముల శబ్దాలకు తమ పక్కనే పిడుగు పడిందా, పక్కన నివాసంపైన పిడుగు పడిందా అన్నట్లుగా చెవులు దద్దరిల్లేలా భయపెట్టింది. సాయంత్రం కావడంతో ఎక్కడ ఉన్నవారు అక్కడే ఆగిపోయారు. వర్షానికి పట్టణంలోని వీధులన్నీ కూడా జలమయమయాయయి. ఇక ప్రధాన రోడ్లు అయితే కాలువలను తలపించేలా వర్షపు నీరు ప్రవహించాయి. ఒకటిన్నర గంటపాటు 7.30 గంటల వరకు నిరాటంకంగా వర్ష బీభత్సానికి వణికిపోయారు. వర్షం మొదలవగానే ఆగిపోయిన విద్యుత్, మాత్రం అర్ధరాత్రి వరకు కూడా పునరుద్ధరణకు నోచుకోకపోవడంతో ప్రజలు అవస్థలు పడ్డారు.

## ముమ్మరంగా విగ్రహ ప్రారంభ ఏర్పాట్లు



మాట్లాడుతున్న బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి

**ఆత్మకూరు:** ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే, దివంగత డాక్టర్ బి.సుందరరామిరెడ్డి కాంస్య విగ్రహ ప్రారంభ ఏర్పాట్లు ముమ్మరంగా చేస్తున్నట్లు మాజీ జెడ్పీ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి తెలిపారు. పట్టణంలోని బీఎస్సార్ ఇంటి వద్ద పలువురు నాయకులతో కలిసి ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మూడు దఫాలుగా ఆత్మకూరు ఎమ్మెల్యేగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఎస్ఎఫ్‌సీ చైర్మన్‌గా విశేష సేవలు అందించిన తన తండ్రి డాక్టర్ బీఎస్సార్ కాంస్య విగ్రహాన్ని 26వ తేదీ బుధవారం భారత మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ ప్రాంతవాసులు పెద్దాయనగా పిలుచుకునే బీఎస్సార్ అన్ని పార్టీలకు అనుకూలంగా ఉండేవారని అజాత శత్రువుగా పేరు గడించారన్నారు. అడిగిన వెంటనే పట్టణంలో విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించిన స్థానిక ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డికి, మున్సిపల్ కమిషనర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టి చంద్రారెడ్డి, కేతా విజయభాస్కర్‌రెడ్డి, పిడికిటి వెంకటేశ్వర్లు, గోరి షబ్బీర్, సాధిక్ హుస్సేన్, పులిమి శైలజారెడ్డి పాల్గొన్నారు.

## బీజేపీ ప్రభుత్వం ప్రజాగ్రహానికి గురికాకతప్పదు



మాట్లాడుతున్న వెంకటయ్య

**ఉదయగిరి:** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రత్యేక హోదా, రాష్ట్ర విభజన హామీలను నెరవేర్చకుండా నిలువునా మోసం చేసిన బీజేపీ ప్రభుత్వం ప్రజాగ్రహానికి గురికాక తప్పదని సీపీఎం నాయకులు కాకు వెంకటయ్య హెచ్చరించారు. ఆయన ఆదివారం సాయంత్రం స్థానిక బస్టాండ్ సెంటరులో ప్రచారభేరి జాత నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం మతవిద్వేషాలనే రెచ్చగొట్టేవిదంగావ్యవహరిస్తున్నదన్నారు. బీజేపీ పాలనలో కార్పొరేటర్లకు రాయితీలు ఇస్తూ సామాన్య ప్రజానీకంపై పెనుభారం మోపిందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఎసభ్యులు కె.విజయమ్మ, నాయకులు ఫరిద్దీన్ బాషా, కె.రమణయ్య, తిరుపతయ్య, నాగేశ్వరరావు నాయబ్ తదితరులు పాల్గొన్నారు.

## జలాశయం వద్ద వాచ్‌మెన్‌ను నియమించాలి



గండిపాళెం జలాశయం

**వరికుంటపాడు:** ఉదయగిరి, వరికుంటపాడు మండలాలకు సాగునీరందించే ఉదయగిరి మండలంలోని గండిపాళెం పొన్నెబోయిన చెంచురామయ్య జలాశయం వద్ద వాచ్‌మెన్‌ను నియమించాలని ఆయకట్టు రైతులు, పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఈ ప్రాంతానికి జలాశయం వరప్రసాదినిగా ఉంది. జలాశయాన్ని సందర్శించేందుకు ప్రతి రోజు సందర్శకులు వస్తుంటారు. ప్రధానంగా సెలవు రోజుల్లో యువకులు సరదాగా గడిపేందుకు ఎక్కువగా వస్తుంటారు. వేసవి కావడంతో జలాశయంలో ఈత కొట్టేందుకు ప్రయత్నిస్తుంటారు. సుమారు పది రోజుల క్రితం కొంతమంది యువకులు జలాశయాన్ని చూసేందుకు వచ్చారు. అందులో ఓ యువకుడు ఈత కొట్టేందుకు జలాశయంలోకి వెళ్లి మునిగి పోవడంతో తోటి యువకులు గమనించి అతన్ని ప్రమాదం నుండి కాపాడగలిగినట్లు తెలిసింది. పోలీసులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినా యువత లెక్క చేయడం లేదు.సెలవు రోజుల్లో పలువురు యువకులు ప్రాజెక్ట్ వద్దకు వచ్చి మద్యం కూడా సేవిస్తుండడంతో పలువురు సందర్శకులు ఇబ్బందులు పడాల్సివస్తున్నారు. ప్రాజెక్ట్ ఉన్నతాధికారులు స్పందించి ప్రమాదాలు జరక్కముందే జలాశయం వద్ద వాచ్‌మెన్‌ను ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

## ప్రభుత్వ బడిలో ప్రతిభావంతులు



2022-23లో జాతీయ స్థాయిలో ఎన్ఎంఎంఎస్ ప్రతిభ కరబర్చిన విద్యార్థులు

**చేజర్ల:** మారుమూల ప్రాంతమైనప్పటికి చదువులో ప్రతిభ కనబరుస్తూ, టాలెంట్ పరీక్షల్లో సైతంలో మేటి విద్యార్థులుగా అందరి ప్రశంసలు పొందుతున్నారు. ప్రతిభ ఎవరి సొత్తు కాదంటూ పల్లెటూరి విద్యార్థులు తమ సత్తాను చాటుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుతూ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా టాలెంట్ టెస్ట్‌ల్లో రాణిస్తున్నారు. చేజర్ల మండలం నాగులవెలటూరు జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువతున్న విద్యార్థులే ఇందుకు ఉదాహరణ కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్) పరీక్షకు ఈపాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఇతర ప్రాంతాల నుంచి నాగులవెలటూరు పాఠశాలకు రావాలంటే గ్రామానికి చెందిన వేలూరు కేశవచౌదరి వ్యాన్ సౌకర్యం కల్పించారు. మరోదాత డాక్టర్ బి రాం ప్రసాద్ చౌదరి స్కూల్‌కు, విద్యార్థులకు తన వంతు సహకారమందిస్తున్నారు. 2022-23లో జాతీయ స్థాయిలో జరిగిన ఎన్ఎంఎంఎస్ పరీక్షల్లో ఈ స్కూల్ నుంచి ఎస్ సాహితీ, పి వెంకట కావ్య, సీహెచ్ చిన్ని ప్రియ, ఎం లక్ష్మీలావణ్య ప్రథమ స్థానం సాధించారు. ఇక్కడ ఎస్ఎస్‌సీ పరీక్షల్లో సుమారు 18 మంది విద్యార్థులు 500పైగా మార్కులు సాధించారు. ఐఐటీలో కేవీ పవన్ అర్హత సాధించగా, ఏపీఆర్‌జేసీలో పి హారిక సీటు సాధించారు. 2020-21 సంవత్సరంలో, 2021-22లో ఎన్ఎంఎంఎస్ పోటీ పరీక్షలో పలువురు విజయం విజయం సంపాదించారు. ఈ స్కూల్ విద్యార్థి కేవీ పవన్ ఐఐఐటీలో సీటు సాధించాడు. అదే సంవత్సరం ఏపీఆర్‌జేసీలో పి.హారిక సీటు సాధించింది. గత సంవత్సరం ఎన్ఎంఎంఎస్‌లో నలుగురు విద్యార్థులు అర్హత సాధించారు. వారికి కేంద్ర ప్రభుత్వం రూ.15 వేలు నగదు అందించింది. విద్యార్థులు మరింతంగా పోటీ పరీక్షలు, చదువులో ప్రతిభ కనబర్చేందు తమ వంతు కృషి చేస్తామని స్కూల్ హెచ్ఎం శైలజ, ఉపాధ్యాయులు పేర్కొన్నారు.

## ధ్యానంతో ఆరోగ్యకర జీవితం

**ఆత్మకూరు:** క్రమం తప్పకుండా ప్రతి ఒక్కరూ ధ్యానం అలవర్చుకోవాలని, దీని వల్ల క్రమశిక్షణ, ఆరోగ్యకరమైన జీవితం లభించడంతో పాటు ఆధ్యాత్మికత అలవడుతుందని ధ్యాన మాస్టర్ విశ్రాంత ఉపాధ్యాయుడు తిరుపతిరెడ్డి తెలిపారు. పట్టణంలోని షిరిడీ సాయి పిరమిడ్ ధ్యానం కేంద్రంలో ఆదివారం ప్రత్యేక ధ్యాన తరగతులు నిర్వహించారు. ధ్యానం వల్లన కలిగే ఉపయోగాలు వివరించారు. మునులు, ఋషుల కాలం నుంచి ధ్యానం విశిష్టతను వివరించారన్నారు. ఈకార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పిరమిడ్ కేంద్రం నిర్వాహకులు డాక్టర్ సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వర్లు తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

## నాగసముద్రంకు స్వచ్ఛ అవార్డు

**కలిగిరి:** మండలంలోని నాగసముద్రం పంచాయతీకి జిల్లా స్థాయిలో స్వచ్ఛతా అవార్డుకు ఎంపికైనట్లు పంచాయతీ కార్యదర్శి, ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ వెలుగోటి మధు ఆదివారం తెలిపారు. పంచాయతీలోని ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ నిర్వహణ, హరిత రాయబారుల ద్వారా చెత్త సేకరణ, వర్మీకంపోస్ట్ ఎరువుల తయారీ, పంచాయతీని పరిశుభ్రంగా ఉంచడం జిల్లా స్థాయి అవార్డు రావడానికి ప్రధాన కారణమన్నారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా అవార్డు అందుకోనున్నామన్నారు. అవార్డు రావడానికి సహకారం అందించిన సర్పంచ్ డి శ్రీనివాసులు, ఉప సర్పంచ్ అక్కెం హజరత్‌రెడ్డిలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## విద్యుత్ లైన్ సమస్యకు పరిష్కారం

**చేజర్ల:** చేజర్ల బస్టాండ్ సెంటర్‌లో విద్యుత్ తీగలు కిందకు ఉండడంతో తరచూ గడ్డి ట్రాక్టర్లు తగలి నిప్పు రవ్వలు రేగి గడ్డి అగ్నికి ఆహుతి అవుతోంది. గత వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు గడ్డి లోడుతో వెళ్తున్న ట్రాక్టర్లు ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలకు తగిలి గడ్డి దగ్ధమై ట్రాక్టర్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. రైతులు, గ్రామస్తుల అభ్యర్థన మేరకు యుద్ధప్రాతి పదికన విద్యుత్ సిబ్బంది రెండు రోజులు శ్రమించి రెండు విద్యుత్ స్తంభాలు అదనంగా నాటి వైర్ల ఎత్తు పెంచారు. దీంతో రైతులు, గ్రామ ప్రజలు ఊపిరి పీల్చుకొని విద్యుత్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

# పుస్తకాల పఠనంతో విజ్ఞానం



విద్యార్థులకు విజ్ఞాన పుస్తకాలను అందజేసిన గ్రంథాలయ సిబ్బంది

**ఆత్మకూరు:** పుస్తక పఠనంతో సంపూర్ణ విజ్ఞానం కలుగుతుందని పుస్తకాల ప్రాధాన్యతను గుర్తించాలని లైబ్రేరియన్ ఓంకారం శ్రీనివాసరాజు తెలిపారు. ప్రపంచ పుస్తక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం పట్టణంలోని గ్రంథాలయంలో పలు పాఠశాలల విద్యార్థులకు పుస్తకాల గొప్పతనం గురించి ఆయన వివరించారు. పుస్తక పఠనంతో ప్రపంచాన్ని మార్చగల శక్తి కలుగుతుందన్నారు. విజ్ఞానం, వినోదం, జ్ఞాపకశక్తి విద్యార్థుల్లో పెరగాలంటే తప్పనిసరిగా పుస్తక పఠనం చేయాలన్నారు. పలు ప్రశ్నలు వేసి వారి జ్ఞాపకశక్తిని పరీక్షించారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరి అసిస్టెంట్ తనూజ, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్సార్ జలకళ అమల్లో ప్రథమ స్థానం

- ఏపీడీ శంకర్ నారాయణ



నబ్బీనగరంలో బోర్ల డ్రిల్లింగ్‌ను పరిశీలిస్తున్న ఆత్మకూరు క్లస్టర్ ఏపీడీ శంకర్ నారాయణ

**ఆత్మకూరురూరల్:** వైఎస్సార్ జలకళ పథకం అములులో ఆత్మకూరు క్లస్టర్ జిల్లాలోనే ప్రథమ స్థానంలో ఉందని ఎన్ఆర్ఈజీఎస్ ఏపీడీ శంకర్ నారాయణ అన్నారు. మండలంలోని నబ్బీనగరంలో వైఎస్సార్ జలకళ మంజూరైన రైతుల పొలాల్లో డ్రిల్లింగ్ ప్రక్రియను ఆదివారం ఆయన క్షేత్ర పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సెక్టార్ పరిధిలోని 9 మండలాల్లో 2,250 మంది రైతులకు తమ పొలాల్లో బోర్లు వేయాలని ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారన్నారు. వీటిలో 1,307 మంది రైతుల భూముల్లో భూగర్భ జలవనరులశాఖ సర్వే పూర్తయిందన్నారు. కలెక్టర్ అనుమతుల కోసం సదరు రైతుల వివరాలను పంపగా 657 మంది రైతుల భూముల్లో బోర్లు వేసేందుకు పరిపాలనాపరమైన అనుమతులు వచ్చాయన్నారు. వీటిలో 554 మందికి రైతులకు ఇప్పటికే బోర్లు డ్రిల్లింగ్ చేయడం పూర్తయిందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో అర్హులైన మిగిలిన రైతులకు కనీసం 500 మందికి రానున్న రెండు నెలల్లో బోర్లు వేసేందుకు ప్రత్యేక కార్యాచరణతో పని చేస్తున్నామని తెలిపారు. నబ్బీనగరంలో ఉపాధి హామీ పథకం ద్వారా జరుగుతున్న పంట కుంటల నిర్మాణాలను ఆత్మకూరు క్లస్టర్ టెక్నికల్ అసిస్టెంట్ రాజేష్‌తో కలిసి ఆయన క్షేత్ర పరిశీలన చేశారు. గిట్టుబాటు కూలి దక్కేలా వలసల ప్రకారం పనులు పూర్తిచేయాలని ఉపాధి కూలీలకు సూచించారు. కార్యక్రమంలో ఆత్మకూరు క్లస్టర్ ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

## యూటీఎఫ్ నూతన కార్యవర్గ ఎన్నిక



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు

**ఆత్మకూరురూరల్(మర్రిపాడు):** మర్రిపాడు మండల యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. స్థానిక యూటీఎఫ్ భవన్‌లో ఆదివారం మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. మండల కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఖాజా రంతుల్లా, సుధాకర్, అసోసియేట్ అధ్యక్షులుగా దావూద్, అనూష, జిల్లా కౌన్సిలర్లుగా పోలిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, ఖాజా రసూల్, ప్రమీల, సాంబశివారెడ్డి, తిరుపాలు, లింగయ్యతో పాటు మహిళా కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు, ఉన్నత పాఠశాలల బాధ్యులు, ఆడిట్ కమిటీ సభ్యులు తదితరులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మోహన్ ప్రసాద్, నాయకులు నాయబ్‌బాషా, రైతు సంఘం జిల్లా కార్యదర్శి మూలి వెంగయ్య, యూటీఎఫ్ మాజీ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## పార్కింగ్ పేరుతో నిలువు దోపిడీ

- కావలి రైల్వేస్టేషన్‌లో ఇదీ సంగతి



కావలి: కావలి రైల్వేస్టేషన్‌లో వాహనాల పార్కింగ్

**కావలి:** కావలి రైల్వేస్టేషన్‌లో పార్కింగ్ పేరుతో కాంట్రాక్టర్లు నిలువు దోపిడీకి పాల్పడుతున్నారు. రెండు గంటలకు జీఎస్టీతో కలిపి రూ.10, రోజుకు రూ.80 వంతున వసూలు చేస్తుండడంతో ప్రయాణికులు గగ్గోలు పెడుతున్నారు. కావలి నుంచి విజయవాడకు రైలు చార్జీనే రూ.80 ఉండగా అంతే మొత్తంలో బండి పార్కింగ్‌కు కూడా వసూలు చేస్తుండడంతో సామాన్యులు అల్లాడిపోతున్నారు. వాహనాల పార్కింగ్ దక్కించుకున్న నిర్వాహకులు కనీస వసతులు కల్పించకుండా ముక్కుపిండి చార్జీలు వసూలు చేస్తున్నారని ప్రయాణికులు వాపోతున్నారు. కావలి రైల్వేస్టేషన్ నుంచి చిరుద్యోగులు, విద్యార్థులు, చిరువ్యాపారులు నిత్యం నెల్లూరు, ఒంగోలుకు రాకపోకలు సాగిస్తుంటారు. ఉదయం వెళితే మళ్లీ సాయంత్రం తిరిగి వస్తుంటారు. దీంతో పార్కింగ్‌కే రోజుకు రూ.60 వరకు చెల్లించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాహనాలకు కనీసం నీడ కూడా ఏర్పాటు చేయకుండా ఇష్టారాజ్యంగా వసూళ్లకు పాల్పడుతున్నారని దుయ్యబడుతున్నారు. పది నిమిషాలు పార్క్ చేసినా రూ.10 చెల్లించుకోవాల్సి వస్తుందని చెబుతున్నారు. పార్కింగ్ ఫీజు పేరుతో అడ్డగోలు వసూళ్లకు రైల్వే అధికారులు అడ్డుకట్ట వేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

### వైభవంగా 16 రోజుల పండగ



ప్రత్యేక అలంకరణలో వేణుగోపాలస్వామి

**జలదంకి:** మండలంలోని బ్రాహ్మణక్రాకలోని వేణుగోపాలస్వామి ఆలయంలో 16 రోజుల పండగ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో స్వామివారికి సుప్రభాత సేవ, రుద్రాభిషేకం, కుంకుమార్చన, అభిషేకాలు, మహా మంగళహారతి, అర్చనలతో పాటు ప్రత్యేక పూజలను శాస్త్రోక్తంగా చేపట్టారు. అనంతరం స్వామి వారి పూజల్లో పాల్గొన్న దంపతులకు పూజారులు బలదానాలు అందించారు.

### శంకర్ జయంతి వేడుకలు రేపు

**ఆత్మకూరు:** జగద్గురు శ్రీ ఆదిశంకరాచార్య జయంతిని ఆత్మకూరు శివాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించనున్నట్లు సీమబ్రాహ్మణ సేవా సంఘం నిర్వాహకులు, ఏపీ పురోహిత అర్చక పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు మేళ్లచెరువు శివకుమార శర్మ ఆదివారం తెలిపారు. శివాలయ ప్రాంగణంలో సంఘం సభ్యులతో కలిసి ఆయన మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా శంకర జయంతిని నిర్వహిస్తూ బ్రాహ్మణ వటువులు (యువకులు) ఉచిత ఉపనయనాలు క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం ఆలయంలో శివపార్వతులకు ప్రత్యేక పూజలు అనంతరం శంకరాచార్యుల చిత్రపటానికి పూజలు నిర్వహించనున్నట్లు తదుపరి ఉచిత ఉపనయనాలు సంప్రదాయబద్ధంగా చేయనున్నట్లు వివరించారు. అనంతరం అన్నప్రసాద వితరణ నిర్వహిస్తామన్నారు. ఉపనయనాలు నిర్వహించుకోవాల్సిన యువకులు సెల్ 94404 65814 నంబరులో సంప్రదించాలని కోరారు.

### నేడు పంచాయతీలకు సర్టిఫికెట్లు

**చేజర్ల(సోమశిల):** జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా గ్రామ పంచాయతీలకు సర్టిఫికెట్లు ప్రదానం చేయనున్నట్లు ఎంపీడీఓ మధుసూదన్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 24వ తేదీ సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో జరిగే ఈ కార్యక్రమానికి పంచాయతీ కార్యదర్శులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు హాజరు కావాలని కోరారు.

### నేడు పంచాయతీరాజ్ దినోత్సవం

**ఆత్మకూరురూరల్:** జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా సోమవారం ఆత్మకూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని అందరూ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు సమావేశానికి హాజరుకావాలని కోరారు.